సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

78932 44734

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

విజేతలకు అభినందన



విజేతలతో సీనియర్ బాక్సర్లు

మల్కాపురం: ఇటీవల నగరంలో జరిగిన బాక్సింగ్ పోటీల్లో 60వ వార్డు గుల్లపాలెం వుడాకాలనీ ప్రాంతానికి చెందిన మైక్ టైసన్ బాక్సింగ్ క్లబ్‌కు చెందిన టీనా,అలేఖ్య ప్రతిభ చూపారు. ఈ మేరకు గుల్లపాలెం మైదానం వద్ద ఆదివారం సెక్రటరీ షేక్ అలీ,గణేష్,హరి, సాయి,నవీన్ తదితరులు అభినందించారు. భవిష్యత్‌లో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఘనంగా బీఎంఎస్ ఆవిర్భావ దినోత్సవం



బీఎంఎస్ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

మల్కాపురం: బీఎంఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని స్థానిక బీఎంఎస్ నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. సింధియా వద్ద షిప్‌యార్డ్ బీఎంఎస్ నాయకుడు సింహాచలం జెండాను ఎగురవేశారు.అనంతరం బాల గంగాధర్ తిలక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు జగదీష్,కృష్ణ,రమేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఓటరు సర్వే

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలోని పలు వార్డుల్లో ఆదివారం కూడా ఓటరు సర్వే చేపట్టారు. జీవీఎంసీ 60వ వార్డు ఇందిరాకాలనీ-1, ఇందిరాకాలనీ-2 ప్రాంతాల్లో ఆ ప్రాంత బీఎల్‌వో,బీఎల్‌ఏలు ఇంటింటికీ వెళ్లి సర్వే చేశారు.జాబితాలో ఉండి అక్కడ నివాసం లేని వారి వివరాలు తెలుసుకున్నారు.అలాగే ఆ ప్రాంతం నుంచి వేరే ప్రాంతాలకు వలస వెళ్లిన వారివి,ఉపాధి నిమిత్తం దూర ప్రాంతాలకు వెళ్లిన వారి వివరాలు సేకరించారు.అలాగే 58,59,61,62,63,40వ వార్డుల పరిధిలో కూడా ఓటరు సర్వే జరిగింది.

అనాథ శవానికి అంత్యక్రియలు



అంత్యక్రియల్లో పాల్గొన్న పి.వి.సురేష్

మల్కాపురం: స్థానిక కల్యాణి ఆస్పత్రి సమీపంలోని ఫుట్‌పాత్‌పై గుర్తు తెలియని వ్యక్తి (అనాథ) మృతి చెంది ఉన్నాడు. ఆ విషయాన్ని పి.వి.ఎస్ హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధి, 60వ వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్‌కు తెలిపారు. ఆయన మల్కాపురం పోలీసులకు సమాచారం ఇచ్చి వారి సమక్షంలో అనాథ శవానికి తన సొంత ఖర్చులతో శ్మశానవాటికకు ఆదివారం సాయంత్రం దగ్గరుండి అంత్యక్రియలు జరిపించారు. కార్యక్రమంలో మల్కాపురం ఎస్‌ఐ దేవుడమ్మ పాల్గొన్నారు.

90 మంది రక్తదానం

ఉక్కునగరం: స్థానిక సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. జేసీఐ స్టీల్‌సిటీ చాప్టర్, లైఫ్ షేర్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో సమితి ఆధ్వర్యంలో 34వ సారి రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. స్టీల్‌ప్లాంట్ విశ్రాంత జీఎం కె.వి.ఎస్. జోగారావు, సత్యసాయి జిల్లా సర్వీస్ కోఆర్డినేటర్లు ఆర్.ఎ. నాయుడు శిబిరాన్ని ప్రారంభించారు. 90 మంది ఉక్కు ఉద్యోగులు రక్తదానం చేశారు. బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగానికి చెందిన ఎల్.వి. రామన్ 61వ సారి, ఆర్‌ఎంఏహెచ్‌పీ విభాగానికి చెందిన కె.వి.ఎల్.ఎన్. రెడ్డి 59వ సారి, ఈఎస్‌ఎండీ విభాగానికి చెందిన ఆర్.ఎ. నాయుడు 27వ సారి రక్తదానం చేయడం విశేషం. మహిళా సేవాదళ్ సభ్యులు పద్మా రాజశేఖర్, విష్ణుదేవి, పూర్ణిమ రక్తదానం చేశారు.

సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ వెస్ట్
8978872250

కుమ్మరించిన వాన



మల్కాపురంలో కురుస్తున్న వర్షం

- రోడ్లపై చేరిన వరదనీరు
- ఇబ్బందులు పడ్డ వాహనదారులు

గోపాలపట్నం: అప్పటి వరకూ ఎండ కాసింది. అంతలోనే ఆకాశంలో నీలి మేఘాలు అలుముకున్నాయి. వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. మధ్యాహ్నం 3.30 గంటలు అయ్యేసరికి చినుకులు ప్రారంభమయ్యాయి. అంతలోనే భారీ వర్షం కురిసింది. పలు ప్రాంతాల్లో కుమ్మరించింది. దీంతో లోతట్టు ప్రాంతాలతో పాటు రోడ్లపై వరద నీరు చేరింది. ఫలితంగా వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. పలు కూడళ్లలో ట్రాఫిక్ జామ్ అయింది. అయితే కొంతమంది వర్షాన్ని ఆస్వాదించారు.

- గోపాలపట్నం, ఎన్‌ఏడీ ప్రాంతంలో కురిసిన వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి. కొత్తపాలెం నుంచి నరవ వెళ్లే రోడ్డుపై మోకాలి లోతులో నీరు ప్రవహించింది. శనివారం, ఆదివారం వరుసగా వర్షం కువరడంతో నీటి ఉధృతి ఎక్కువయింది. ఇటీవల జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకున్నా వరద ముప్పు తప్పలేదు. దిగువ ప్రాంతంలో అనధికార లేవుట్ల వల్ల ఈ పరిస్థితి ఏర్పడుతోందని స్థానికులు వాపోతున్నారు.

పారిశ్రామిక ప్రాంతంలో..

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో ఆదివారం సాయంత్రం జోరు వాన కురిసింది. ఉదయం నుంచి ఎండ కాసినా ఒక్కసారిగా చినుకులతో చల్లబడడంటంతో పలువురు సేద తీరారు. జోరున కురిసిన వర్షానికి పారిశ్రామిక ప్రాంతంలోని ప్రధాన కూడళ్లలో నీరు నిలిచింది. కాలువలు పొంగాయి. శ్రీహరిపురం,మల్కాపురం,కోరమాండల్,సింధియా తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది



గోపాలపట్నంలో కమ్ముకుంటున్న కారు మబ్బులు



గోపాలపట్నం బీఆర్‌టీఎస్ రహదారిలో చేరిన వర్షపు నీరు



కొత్తపాలెం నుంచి నరవకు వెళ్లే రహదారిపై పారుతున్న వర్షపు నీరు

స్వచ్ఛతలో మేము సైతం...



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

గోపాలపట్నం: చదువులోనే కాదు.. సేవలోనూ మేము ముందుంటామని గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థులు చాటి చెప్పారు. నేషనల్ గ్రీన్ కాప్స్ ఎకో క్లబ్ విద్యార్థులు జోడుగుళ్లపాలెం బీచ్‌లో స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న వ్యర్థాలను సేకరించారు. సాగర తీరాన్ని శుభ్రం చేశారు. జిల్లా కోఆర్డినేటర్ సూరెడ్డి బాబూరావు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఎకో క్లబ్ గురించి అవగాహన కల్పించామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో పిల్లకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం దోహద పడుతుందన్నారు. కార్యక్రమంలో జోన్-2 జెడ్సీ కె. కనకమహాలక్ష్మి, పారిశుధ్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొండవాలు ప్రాంతాల్లో కార్పొరేటర్ పర్యటన

మల్కాపురం: జీవీఎంసీ 62వ వార్డు కార్పొరేటర్,స్టాండింగ్ కమిటీ సభ్యుడు బల్లా లక్ష్మణరావు ఆదివారం వార్డు పరిధిలోని కొండ వాలు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. స్వయంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించారు. జనతాకాలనీ కొండవాలు ప్రాంతంలో మెట్ల మార్గాలు సరిగ్గా లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులు,మెట్ల మార్గానికి అడ్డంగా వేసిన పైపులైన్ సమస్య,తాగునీటి కోసం పడుతున్న ఇబ్బందులు తెలుసుకున్నారు.

ఆయా సమస్యలపై సంబంధిత అధికారులతో అక్కడి నుంచి ఫోన్‌లో అధికారులతో మాట్లాడారు. రెండు వారాల్లోగా సమస్యలు పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.కార్యక్రమంలో పార్టీ నాయకులు రాము,సంతోష్,నక్క సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కొండవాలు ప్రాంతంలో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ లక్ష్మణరావు

విద్యతో గౌరవం



ఉత్తమ విద్యార్థికి ప్రోత్సాహక బహుమతి అందజేస్తున్న ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యే గణబాబు

కంచరపాలెం: ఏ రంగంలో ఉన్నా.. విద్య అనేది ఉన్నత స్థాయి, గౌరవాన్ని ఇస్తుందని అనకాపల్లి పార్లమెంట్ సభ్యురాలు భీశెట్టి సత్యవతి అన్నారు. కేంద్ర గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం తాటిచెట్లపాలెం ఆశీర్వాద కల్యాణ మండపంలో ఉత్తమ విద్యార్థులకు పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. సంఘ అధ్యక్షుడు బుద్ధ శివాజీ, ప్రధాన కార్యదర్శి ఆడారి లచ్చ అప్పారావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు ఎంపీ సత్యవతి, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు చేతుల మీదుగా విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రతీ ఏటా గవర సామాజిక వర్గ విద్యార్థులను ఈ విధంగా ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. గణబాబు మాట్లాడుతూ ప్రపంచంతో పోటీ పడుతున్న నేటి సమాజంలో విద్యకు ప్రధాన ప్రాధాన్యత అవసరమన్నారు. బుద్ధ శివాజీ మాట్లాడుతూ తమ సామాజిక వర్గం విద్య ద్వారా అభివృద్ధి చెంది, ప్రతి విద్యార్థినీ ప్రోత్సహించాలని, ఏటా సుమారు 500 మంది పిల్లలకు ప్రోత్సాహకాలు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ బుద్ధ చంద్రశేఖర్, డాక్టర్ బుద్ధ మురళీసంతోష్, ఆడారి పూరి జగన్నాథం, కాళ్ల రాధిక, కొణతాల వీకే శ్రీనివాసరావు, వేగి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ముఖ్యమంత్రి రాజీనామా చేయాలి



జ్ఞానాపురం అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న పలు సంఘాల నాయకులు

కంచరపాలెం: మణిపూర్‌లో ఆదివాసీ మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులు, అత్యాచారాలపై స్పందించని జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రేఖాశర్మ, ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్ వెంటనే రాజీనామా చేయాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు జ్ఞానాపురం అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ ఆందోళనలో ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ), భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ), మురికివాడ నివాసీయుల సంక్షేమ సంఘం (ఎంఎన్‌ఎస్‌ఎస్), అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య నేతలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జాతీయ కమిటీ సభ్యుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మూడు నెలలుగా మణిపూర్‌లో అల్లర్లు, అత్యాచారాలు, హత్యాకాండలు జరుగుతున్నా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, జాతీయ మహిళా కమిషన్ పట్టించుకోలేదని ఆరోపించారు. మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేసినా స్పందించలేదని వాపోయారు. మత విద్వేషాలను బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ ప్రేరేపిస్తున్నాయని ఆరోపించారు. సుప్రీం కోర్టు స్వయంగా విచారణ చేపట్టి దోషుల్ని కఠినంగా శిక్షించాలని, ఆదివాసీ మహిళలకు రక్షణ కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలు సంఘాల నేతలు కె. నిర్మల, ఎస్. వెంకటలక్ష్మి, ఇందిర, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శాకాహార సద్భావన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న పిరమిడ్ సొసైటీ ప్రతినిధులు, సభ్యులు

మల్కాపురం: పత్రీజీ పిరమిడ్ స్పిరిచ్యువల్ ట్రస్ట్(వైజాగ్) ఆధ్వర్యంలో ఆదివారం శాకాహార సద్భావన ర్యాలీ నిర్వహించారు. 58వ వార్డు పిలకవానిపాలెం శ్రీసాయిబాబా పిరమిడ్ ధ్యాన కేంద్రం నిర్వాహకురాలు గోందేశి పద్మావతి సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టారు. అధిక సంఖ్యలో పిరమిడ్ మాస్టర్స్ పాల్గొని శ్రీహరిపురం నుంచి పిలకవానిపాలెం వరకు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ధ్యానం మనిషిని ఒత్తిడి నుంచి దూరం చేసి, ప్రశాంతతను చేకూర్చుతుందన్నారు. శాకాహారం తినడం వల్ల ఆరోగ్యంతోపాటు మనిషికి ఆలోచన శక్తి పెరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ శాకాహారులుగా ఉండాలనే ఆలోచనతోపాటు ధ్యానం వంటి కార్యక్రమాల్లో పాల్గోవాలనే ఈ ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పిరమిడ్ సొసైటీ సభ్యులు శివగణేశ్వరరావు, జయలక్ష్మి, మూర్తి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చలసాని ఆశయాలు కొనసాగిద్దాం



మాట్లాడుతున్న విప్లవ రచయితల సంఘం రాష్ట్ర నేత ప్రసాద్

సీతంపేట: మార్క్సిజాన్ని సమాజానికి అన్వయించి.. పరిశీలించే దృష్టితో చూసినప్పుడే వాస్తవ పరిస్థితులు అర్థం అవుతాయని నమ్మే వ్యక్తి చలసాని ప్రసాద్ అని విప్లవ రచయితల సంఘం రాష్ట్ర నేత సి.ఎస్.ఆర్ ప్రసాద్ అన్నారు. మార్క్సిస్టు మేధావి, విప్లవ రచయిత చలసాని ప్రసాద్ 8వ వర్ధంతి సందర్భంగా 'నేటి రాజకీయాలు సాహిత్యం' అనే అంశంపై శనివారం పౌరగ్రంథాలయంలో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్క్సిజాన్ని చలసాని ప్రసాద్ ముందుగా జీవితానికి అన్వయించుకుని, ఆ దిశగా కుటుంబ సభ్యులను భాగస్వామ్యం చేశారన్నారు. స్టాలిన్ హింసాకాండపై అనేక మంది విమర్శించిన ప్పటికీ.. చలసాని మాత్రం స్టాలిన్ చేసిందే సరైందని అన్నారని తెలిపారు. ఆ రోజుల్లో స్టాలిన్ ఆ విధంగా వ్యవహరించకపోతే అమెరికా, జర్మనీ కలిసి సోషలిజాన్ని కూల్చివేసేవారని చలసాని చెప్పేవారన్నారు. బీజేపీ అమలు చేస్తున్న మత తత్వ ఫాసిజాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించేవారని గుర్తు చేశారు. ఉత్తరాంధ్రలో ప్రజా ఉద్యమాలకు తలలో నాలుకగా వ్యవహరించిన కలం యోధుడు చలసాని ఆశయాలను కొనసాగించాలన్నారు. వీక్షణం సంపాదకుడు ఎన్.వేణుగోపాల్ మాట్లాడుతూ బీజేపీ పాలకులు హిట్లర్‌ను ఆదర్శంగా తీసుకుని హిందూమతం పేరుతో కలహాలు సృష్టిస్తున్నారని చలసాని చెప్పేవారన్నారు. ప్రముఖ రచయిత్రి మల్లీశ్వరి 'వర్తమానం చలసాని ప్రాసంగికత' అనే అంశంపై, ప్రముఖ రచయిత ఆచార్య చందు సుబ్బారావు 'చలసాని వ్యక్తిత్వం నిబద్ధత' అనే అంశంపై, మార్క్సిస్టు అధ్యయన కేంద్రం అధ్యక్షుడు జె.వి.సత్యనారాయణమూర్తి 'భారతదేశంలో ప్రజాస్వామ్యం, భవిష్యత్' అనే అంశంపై ప్రసంగించారు. ముందుగా చలసాని చిత్రపటానికి నివాళులు అర్పించారు. మాజీ ఎమ్మెల్యే మానం ఆంజనేయులు, ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు, జర్నలిస్టు సి.ఎస్.క్షేత్రపాల్ రెడ్డి, చైతన్య మహిళా సంఘం ప్రతినిధి కె.లలిత, పౌరసంఘాల సమన్వయకర్త పి.చంద్రశేఖర్, న్యాయవాది పద్మ పాల్గొన్నారు.

29న ప్రైవేటు ఉపాధ్యాయులకు శిక్షణ

గాజువాక: మారిన పాఠ్యాంశాలపై ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకు ఈ నెల 29న నిర్వహించనున్న ప్రత్యేక శిక్షణను పాఠశాలల యాజమాన్యాలు జయప్రదం చేయాలని జిప్సా అధ్యక్షుడు పాలవలస భాస్కరరావు కోరారు. గాజువాకలో ఆదివారం నిర్వహించిన జిప్సా సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. నిష్ణాతులతో శిక్షణను నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో జిప్సా ప్రతినిధులు బి.శ్రీనివాసరావు, డి.శ్రీనివాస్, ఆర్.శోభన్‌బాబు పాల్గొన్నారు.

ముగిసిన గరికిపాటి ప్రవచనాల కార్యక్రమం



ప్రవచిస్తున్న గరికిపాటి నరసింహారావు

సీతమ్మధార: మహా సహస్రావధాని, పద్మశ్రీ పురస్కార గ్రహీత గరికిపాటి నరసింహారావు ఆధ్యాత్మిక ప్రవచనాల కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. అల్లూరి సీతారామరాజు సమితి ఆధ్వర్యంలో సీతమ్మధార క్షత్రియ కల్యాణ మండపంలో మూడు రోజుల పాటు నిర్వహించారు. పలు ఆధ్యాత్మిక అంశాలపై ఆయన ప్రవచించారు. అనంతరం గరికిపాటి నరసింహారావు దంపతులకు సమితి అధ్యక్షుడు డి.తిరుపతిరాజు, కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్య క్రమంలో చైర్మన్ ఎం.ఎస్.ఎన్.రాజు, సెక్రటరీ డి.ఎస్.పి.వర్మ, కోశాధికారి కె.శ్రీహరిరాజు, జాయింట్ సెక్రటరీ పి.వి.కె. హనుమాన్‌రాజు, ఈసీ మెంబర్లు, విజయ నిర్మాణ్ సంస్థ అధినేత విజయకుమార్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

లివర్ సమస్యలపై వైద్య శిబిరం

గోపాలపట్నం: గోపాలపట్నం బెహరా ఆస్పత్రిలో ఆదివారం లివర్ సమస్యలపై ఉచిత అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ఎండీ డాక్టర్ బెహరా రవితేజ మాట్లాడుతూ కాలేయ సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సుమారు రూ.5,000 ఖర్చు అయ్యే ఫైబ్రో స్కాన్ పరీక్షలను ఉచితంగా చేశామని చెప్పారు. కాలేయ సమస్యలు ఎక్కువగా మద్యం తాగే వారు, జంక్ ఫుడ్ తినే వారికి వస్తాయన్నారు. ఈ సమస్యపై ప్రజలకు సేవలు అందించేందుకు లివర్ క్లినిక్‌ను ఆగస్టు 1 నుంచి ప్రారంభిస్తున్నామని తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు వైద్య నిపుణుడు అందుబాటులో ఉంటారని చెప్పారు. సుమారు 163 మంది వ్యాధిగ్రస్తులు శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు చేసుకుని వైద్యుడి సలహాలు పొందారు.

పోర్టు కార్మికులకు అండగా ఉంటాం



దీక్షా శిబిరంలో కూర్చుని మద్దతు తెలుపుతున్న రుద్రరాజు

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టు కార్మికులకు అండగా ఉంటామని పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు అన్నారు. గంగవరం పోర్టు ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ ఆస్పత్రి వద్ద చేపట్టిన నిరసన దీక్షలు ఆదివారం 20వ రోజుకు చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో శిబిరాన్ని ఆయన సందర్శించారు. కార్మికుల ఆందోళనకు సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సున్నితమైన సమస్యలను పరిష్కరించడంలో పోర్టు యాజమాన్యం వైఖరి సరికాదన్నారు. కార్మికులకు రూ.36వేలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. విధుల నుంచి తొలగించిన కార్మికులను మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నొల్లి తాతారావు, జెర్రిపోతుల ముత్యాలు, సీపీఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు, కొవిరి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రానికి కనువిప్పు కలిగే వరకు ఉక్కు ఉద్యమం

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కలిగే వరకు ఉక్కు ఉద్యమం ఆగదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద కొనసాగుతున్న రిలే దీక్షలు ఆదివారం నాటికి 892వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షా శిబిరంలో ఇంటక్ ప్రతినిధులు, కార్మికులు కూర్చున్నారు. ప్రభుత్వ రంగ పరిశ్రమల వల్లనే దేశంలో ఆర్థికాభివృద్ధి జరిగిందని, దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ రంగ సంస్థల పట్ల కేంద్రం పునరాలోచించుకోవాలన్నారు. కార్మిక హక్కులు అమలు కావాలన్నా, నిర్వాసితులకు న్యాయం జరగాలన్నా విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను రక్షించుకోవడం కోసం కార్మిక వర్గం ఎలాంటి త్యాగాలకైనా సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకుల, కార్మికులు పాల్గొన్నారు.

ఆలయాల స్థలాల జోలికొస్తే సహించం

పిలకవానిపాలెం గ్రామస్తుల ఆందోళన



పురాతన ఆలయం వద్ద ఆందోళన చేస్తున్న పిలకవానిపాలెం గ్రామస్తులు

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు పిలకవానిపాలెం వాసుల గ్రామదేవతలైన కుంచమాంబ,నీలిమాంబ ఆలయాలు ఉన్నాయి. ఈ ఆలయాలకు చుట్టుపక్కల భూములను కొంత మంది రైతులు విక్రయించారు. అమ్మవార్లకు చెందిన సుమారు 600 గజాల స్థలం విడిచిపెట్టారు. అయితే ఈ రెండు పురాతన ఆలయాలకు సమీప భూమిని హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి కొనుగోలు చేశారు.తాను కొనుగోలు చేసిన భూమిలో రెండు ఆలయాలు ఉన్నాయని,అందు వల్ల వాటిని తొలగించి గ్రేటర్ కమ్యూనిటీ నివాసాలు నిర్మిస్తామని ముందుకు వచ్చారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పార్టీలకు అతీతంగా ఆదివారం ఆలయాల వద్దకు వచ్చి ఆందోళన చేపట్టారు.అమ్మవార్ల ఆలయానికి సంబంధించిన భూమిని మినహాయించి భవనాలు నిర్మాణం చేసుకోవాలని హితవు పలికారు. అలా కాదని ఆలయాలను ముట్టుకుంటే అడ్డుకోవాల్సి వస్తుందని నినాదాలు చేశారు.

ఆకతాయిలు హద్దు మీరితే చర్యలు తప్పవు



యువతకు సూచనలిస్తున్న సీఐ దేముడుబాబు

మల్కాపురం: మల్కాపురం సీఐ జి.డి.బాబు ఆదివారం స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. 60వ వార్డు గుల్లపాలెం వుడాకాలనీ మైదాన ప్రాంతాల్లో కాలక్షేపం చేస్తున్న యువతతో పాటు ద్విచక్ర వాహనాలపై అతి వేగంగా వెళ్తున్న వారికి, గట్టులపై ధూమపానం చేస్తున్న వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. సమయం వృథా చేయకుండా తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలు నెరవేర్చాలని సూచించారు. రోడ్లపై తిరిగితే విలువైన సమయాన్ని కోల్పోయిన వారు అవుతారని, ఆ సమయంలో ఎంచుకున్న రంగంపై దృష్టిసారిస్తే మంచి ఫలితాలు సాధిస్తారని సూచన చేశారు. ద్విచక్ర వాహనాలపై పరిమితికి మించి ప్రయాణం చేసినా.. మహిళలపై అసభ్యకరంగా ప్రవర్తించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. యువతతో చెడు అలవాట్లకు దూరంగా ఉంటామని,అల్లర్లు,గొడవలకు దూరంగా ఉంటామని ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో మల్కాపురం పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సినీ పరిశ్రమకు కోవిడ్ కొత్త పాఠాలు



మాట్లాడుతున్న సినీ సంగీత దర్శకుడు ఆర్.పి.పట్నాయక్

సీతంపేట: కోవిడ్ మహమ్మారి సినీ పరిశ్రమతో పాటు ప్రేక్షకులకు కొత్త పాఠాలు నేర్పిందని ప్రముఖ సినీ సంగీత దర్శకుడు ఆర్.పి.పట్నాయక్ అన్నారు. వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక పౌర గ్రంథాలయంలో 'కోవిడ్ తర్వాత ప్రపంచ సినిమా పరిస్థితి' అంశంపై ఆదివారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఇళ్లల్లో కూర్చొని తమకు నచ్చిన సినిమా వీక్షించే అవకాశం కలిగిందన్నారు. ప్రేక్షకులు సినిమాలు చూసే విధానం కూడా మారిందన్నారు. ముఖ్యంగా సినిమా హాళ్లకు వెళ్లే ప్రేక్షకుల సంఖ్య బాగా తగ్గిందని అభిప్రాయపడ్డారు. మన సినిమాలు ఇతర భాషా చిత్రాలతో పోల్చుకునే అవకాశం కలిగిందన్నారు. ఈ సందర్భంగా పలువురు అడిగిన ప్రశ్నలకు ఆర్‌పీ జవాబులిచ్చారు. ఫిల్మ్ సొసైటీ సభ్యులు పి.ఎన్.మూర్తి పెన్సిల్‌తో గీసిన స్కెచ్‌ను ఆయనకు బహూకరించారు. నరవ ప్రకాశరావు మాట్లాడుతూ పట్నాయక్ సంగీత దర్శకత్వం వహించిన పలు చిత్రాలతో త్వరలో ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ఎస్.ఎ.డి. పాల్, కాశీ విశ్వేశ్వరరావు, బి.చిన్నారావు, బాబ్జి, కుమారి, అనురాధ, శివన్నారాయణ, చంద్రశేఖర్, రాజీవ్ పాల్గొన్నారు.

స్టీల్‌సిటీ డిపోలో కొనసాగుతున్న దీక్షలు



స్టీల్ సిటీ డిపో దీక్షలో పాల్గొన్న కార్మికులు

ఉక్కునగరం: ఆర్టీసీ కూర్మన్నపాలెం స్టీల్‌సిటీ డిపోలో ఎన్‌ఎంయూ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. డిపో ఆవరణలోని యూనియన్ కార్యాలయంలో డివిజనల్ అధ్యక్షుడు వి.ఎస్.ఆర్. మూర్తి ఆదివారం 10వ రోజు దీక్షలను ప్రారంభించారు. బస్సులకు స్పేరు పార్టులు ఇప్పించాలని, అన్యాయంగా జీతం కోత విధించిన వారికి జీతాలు ఇవ్వాలని, ఓటీ, నైట్ షిఫ్ట్ అలవెన్స్‌లు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. దీక్షల్లో జె.ఎల్. రావు, ఎ.వి. రమణ, డి. రాము, జె.ఎస్ రావు కూర్చున్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

వైజాగ్ వెస్ట్
9912222753, 9705933394
Office mail : sakshiadvtvsp@gmail.com